క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు, పూల మాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి రవిశేఖర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారికి కానుకలు, ముడుపులను సమర్పించుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలోని వివిధ ఆలయాలలో పూజలు నిర్వహించారు.

విస్తారంగా కంది సాగు



ఆశాజనకంగా ఉన్న కంది పంట

పులివెందుల రూరల్ : మండల వ్యాప్తంగా రైతులు కంది పంటను విస్తారంగా సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పులివెందుల మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు 504 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు బాగా పడుతుండటంతో కంది పంట ఆశాజనకంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కంది పంట కూడా బాగా దిగిబడి విచ్చే విధంగా ఏపుగా పెరిగాయని రైతులు అంటున్నారు. వర్షాలు కూడా సకాలంలో పడటంతో కంది పంట ఏపుగా పెరిగిందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో కంది పంట సాగు చేశారని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి తెలిపారు.

జాతీయ రహదారిపై పెద్ద గుంత..



జాతీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంత

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల–ముద్దనూరు జాతీయ రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురివుతున్నారు. పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై పెద్ద గుంత ఏర్పాడింది. స్థానికులు గుంత చుట్టు గుడ్డను కట్టి జాగ్రత్త అని సూచికను ఏర్పాటు చేశారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

సింహాద్రిపురం : మండల పరిధి గురజాల గ్రామంలోని పాత సచివాలయం వద్ద ఆదివారం అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్లు 130 మంది రోగులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత జబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామ నాయకులు కందులఓబుళరెడ్డి, రామచంద్రారెడ్డి, గంగాధరరెడ్డి, ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల వాసికి గ్లోబల్ టూరిజం అవార్డు



గ్లోబల్ టూరిజం అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు సుజన్‌కుమార్

ఎర్రగుంట్ల : ఆసియా ప్రైమ్ మీడియా నిర్వహించిన ప్రతిష్టాత్మక గ్లోబల్ టూరిజం అవార్డును ఎర్రగుంట్లకు చెందిన ఉపాధ్యాయుడు దరియా సుజన్‌కుమార్ అందుకున్నాడు. శుక్రవారం రాత్రి హైదరాబాదులో తాజ్ డెక్కన్ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర పర్యటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగ అందుకున్నారు. దరియా సుజన్‌కుమార్ ఉపాధ్యాయుడుగా, మేజిషియన్‌గా ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రతిభను కనపరించారు. ఈ ప్రతిభకుగాను ఆసియా ప్రైమ్ మీడియా సంస్థ గుర్తించింది.

ప్రకృతి ప్రకోపం.. అన్నదాతకు శాపం



దెబ్బతిన్న వరి పంట వద్ద ఆవేదన చెందుతున్న రైతులు

వేంపల్లె : అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా నాలుగు రోజులపాటు వర్షాలు భారీగా కురిశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతి కందే తరుణంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు అన్నదాతకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది మోటార్ల కింద ముందుగానే వరి పంటను సాగు చేశారు. రైతులు ఐదు నెలలపాటు కష్టపడినా ఫలితం లేకుండా పోయింది. ఈ వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నేలమట్టమైంది. వరి పంట నేలపాలు కావడంతో ఇప్పటికే మోసులు వచ్చి పనికిరాకుండా పోయింది. దీనివల్ల ఖర్చులు తడిసిమోపెడయ్యే అవకాశం ఉందని అన్నదాతలు వాపుతున్నారు.

వేంపల్లె మండల వ్యాప్తంగా 1000 ఎకరాలు పైగానే రైతులు వరి పంటను సాగు చేశారు. ఇడుపులపాయ, వీరన్న గట్టుపల్లి, కుమ్మరంపల్లి, వేంపల్లి, ఎగువ తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో అనేక మంది రైతులు వరి పంటను సాగుచేసి తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే 300 ఎకరాలకుపైగా వరి పంట నేలకొరిగాయి. కొందరు రైతులు భూయజమానికి కౌలు ఇవ్వాలని, పెట్టిన ఖర్చులన్నీ బూడిదలో పోసినట్టుయ్యిందని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గిన వరి కోత కోసేందుకు కోత యంత్రాలు, ట్రాక్టర్లు పొలాల్లోకి దిగుబడి పోతుండటంతో ఉన్న పంట కూడా దక్కుతుందా లేదా అన్న సందేహంలో రైతులు ఉన్నారు. గత నాలుగు రోజులుగా 260 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి పంటకు మంచి ధర పలుకుతున్న తరుణంలో వర్షాలవల్ల రైతులు నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరి పంట సాగు చేసిన రైతులకు సుమారు రూ.2కోట్ల వరకు నష్టం వాటిల్లింది. పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళనలో రైతన్నలు

ఖరీఫ్ పనులు ముమ్మరఅవుతున్న దశలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈశాన్య ఋతుపవనాలు ప్రవేశించినట్లు వాతావరణ శాఖ తెలియజేసింది. దీనికి తోడు బంగాళాఖాతంలో ఈనెల 22న, 25న మరో రెండు వాయుగుండాలు ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పదేపదే ఆకాశంవైపు పంట వైపు చూస్తున్నారు. గత నాలుగు రోజులుగా రాత్రి సమయాల్లో వర్షం కురుస్తుండటంతోపాటు పగలు సమయంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చివరి దశలో వర్షాలు కురిస్తే నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుత ఖరీఫ్ వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వరి పంటను దెబ్బతీస్తున్నాయి. ఇటీవల నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరిగింది. మూడు ఎకరాలు వరి పంటను సాగు చేశాను. ఆరుగాలం కష్టించి పంటను కాపాడుకున్న తీరా 20 రోజుల్లో పంట చేతికోస్తుందనగా ప్రకృతి ప్రకోపం చూపింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించుకుంటే తమ బ్రతుకులపై అప్పుల భారం పెరిగిపోతుంది.

- వి.రామకృష్ణారెడ్డి (వరి రైతు), అలిరెడ్డిపల్లె, వేంపల్లె

వరి పంటకు మోసులు వచ్చాయి



వరి పంట పండి చేతికి వచ్చే సమయంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు తీవ్రంగా నష్టపోయాం. నాలుగు ఎకరాల్లో వరి పంట నేలమట్టం కావడంతో మోసులు వచ్చి పనికి రాకుండా పోయింది. పెట్టుబడి అయినా దక్కుతుందని అనుకుంటే అప్పులు మిగిలాయి. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- అమరావతి రాజా (కౌలు రైతు), వేంపల్లె

కోత దశకు చేరుకున్నాయి



ముందుగా వేసిన వరి పంట కోత దశకు చేరుకుంటున్నాయి. ఆలస్యంగా వేసిన వరి పొలాల్లో పంట గింజ గట్టిపడే దశలో ఉంది. నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వారిపైరు భూమిపై పడిపోయింది. ఈ స్థితిలో ధాన్యాన్ని కొనేందుకు ఎవరు ముందుకు రారు. అంతేకాకుండా ఈ సమయంలో తుపాన్ హెచ్చరికలు ఆందోళన గురి చేస్తున్నాయి.

- వి.వెంకటనారాయణ రెడ్డి (వరి రైతు), ఎగువ తువ్వపల్లె, వేంపల్లె

సీసీరోడ్డుకు శంకుస్థాపన

పెండ్లిమర్రి : పల్లె పండుగ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని నందిమండలం, సోగాల్‌పల్లె గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నందిమండలంలో రూ.30 లక్షలు, సోగాల్‌పల్లెలో రూ.15లక్షల వ్యయంలో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓ ఓబులమ్మ, పీఆర్‌ఏఈ రహంతుల్లా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. రూ.36 లక్షలతో నాలుగు సిమెంట్ రోడ్లకు ఎంపీడీఓ కుళాయిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సునీల్, ఏపీఓ రామానుజులరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్, ఉగ్గన్న అంగడి నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా, పాతగంగిరెడ్డి ఆసుపత్రిలోని బజార్లకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లె : మానవతా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ సంస్థ మండల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని ప్రజలతోపాటు చూట్టు ఉన్న మండలాల 400 మంది ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వంశీ విహారి, డాక్టర్ సాయిచరిత, డాక్టర్ శివబాబు, డాక్టర్ యోగేశ్వరబాబులు వైద్య సేవలు అందించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తమ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వివిధ సేవలు అందించేందుకు కృషి చేస్తామని, ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని సంస్థ చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు రామమునిరెడ్డి, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కావలి కృష్ణతేజ, చల్లా బాలాజీ, పోతిరెడ్డి శ్రావణ్, గోపి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు ఎన్ని తిరకాసులో..!

- విత్తనాల రిజిస్ట్రేషన్‌కు వేలిముద్ర వేయాలి
- విత్తనాలు తీసుకెళ్లేటప్పుడు వేలిముద్ర వేయాల్సిందే



రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న రైతు సేవా కేంద్ర సిబ్బంది (ఫైల్)

వేముల : రబీ సాగుకు అరకొర సబ్సిడీతో అందించే శనగ విత్తనాలకు ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. రబీ సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై శనగ విత్తనాలను మంజూరు చేసింది. గత ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రబీ సాగుకు శనగ విత్తనాలను మంజూరు చేయగా, కూటమి ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగ విత్తనాలకు రైతులు వేలిముద్రలు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆయా రైతు సేవా కేంద్రాలలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించిన తర్వాతనే శనగ విత్తనాలను రైతులకు అందిస్తున్నారు. అయితే ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సబ్సిడీ శనగ విత్తనాలకు కొత్త నిబంధనలు తెరపైకి తెస్తోంది. సబ్సిడీ శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్‌కు వేలిముద్ర వేసిన రైతులు విత్తనాలను తీసుకెళ్లే సమయంలోనూ వేలిముద్రలు వేయాలని వ్యవసాయ శాఖకు ప్రభుత్వం ఆదేశాలు అందాయి. దీంతో సోమవారం నుంచి ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో సబ్సిడీ శనగ విత్తనాలను రైతులకు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు విత్తనాలు తీసుకెళ్లే సమయంలో వేలిముద్రలు వేయాలని సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ధరకు బయట మార్కెట్‌లో దొరుకుతున్నాయి. శనగ విత్తనాలకు ప్రభుత్వం ఇన్ని తిరకాసులు పెడుతుందని ఊహించలేకపోయామని, లేదంటే బయట మార్కెట్‌లో తెచ్చుకునేవారమని రైతులు పెదవి విరుస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు వేలిముద్రలు వేసిన రైతులు విత్తనాలను తీసుకెళ్లేందుకు వేలిముద్రలు వేయాల్సి రావడంతో రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

రేపటి నుంచి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కేంద్రాలు

పులివెందుల టౌన్ : పట్టణంలో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీవరకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నగరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 23న అహోబిలాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న రమణప్ప సత్రంబడి పాఠశాలలో, 24వ తేదీన కడప రోడ్డులోని గురుకుల పాఠశాల, పట్టణంలోని వైఎస్ వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, 25వ తేదీన ఎస్‌బీఐ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోనూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ బయోమెట్రిక్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇక నుంచి కోగటం బస్సు 8 సింగిల్స్

కమలాపురం : ప్రొద్దుటూరు నుంచి కడప వయా కోగటం, కమలాపురం బస్సు సర్వీసు సోమవారం నుంచి 8 సింగిల్స్ సర్వీసుగా పెంచుతున్నట్లు ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ లావణ్య ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గతంలో 6 సింగిల్స్ ఉన్న ఈ బస్సు సర్వీసు ఆర్‌ఎం గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు 8 సింగిల్స్‌గా పెంచుతున్నట్లు వారు తెలిపారు. చివరి సర్వీసు రాత్రి 7.15 గంటలకు ప్రొద్దుటూరులో బయలుదేరి ఎర్రగుంట్ల, కమలాపురం మీదుగా కడప కొత్త బస్టాండుకు చేరుకుంటుందన్నారు. అలాగే తిరిగి రాత్రి 9 గంటలకు మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందని, ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్ల మీదుగా వెళ్లే ప్రతి పల్లె వెలుగు బస్సు కడప కొత్త బస్టాండుకు వెళ్లి తర్వాత పాత బస్టాండుకు వెళ్తుందని, ప్రయాణీకుల అభ్యర్థన మేరకు ఈ మార్పు చేశామని, దీనిని ప్రయాణీకులు గమనించాలని వారు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి జాతీయ ప్రతిభా అవార్డు ప్రదానం



జాతీయ ప్రతిభా అవార్డును అందుకుంటున్న విరుపాక్షి ప్రభాకర్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న అధ్యాపకుడికి జాతీయ ప్రతిభ అవార్డు ప్రదానం చేసినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార స్వామిగుప్తా తెలిపారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్‌కు గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఆదివారం శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డును ప్రదానం చేశారు. ఈయన గత 8 ఏళ్లుగా ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలలో విధులను నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

వివాదానికి ముగింపు

ముద్దనూరు : 3 రోజులుగా మద్యం దుకాణం ఏర్పాటులో నెలకొన్న సమస్య ముగిసినట్లు సమాచారం. సీఎం సురేష్ నాయుడు వర్గీయునికి చెందిన మద్యం దుకాణం ప్రారంభానికి కూటమిలోని ఓ వర్గం నాయకులు అడ్డుపడుతుండటంతో సమస్య తలెత్తింది. దీంతో ముద్దనూరులో రెండవ మద్యం దుకాణం ఏర్పాటుకాలేదు. అయితే ఆదివారం ఈ గొడవ సద్దుమణిగింది. సురేష్ నాయుడు వర్గీయుని మద్యం దుకాణం ఏర్పాటుకు రాజీ మార్గంలో అడ్డంకులు తొలగిపోయినట్లు తెలిసింది. ఒకటిరెండ్రోజుల్లో మద్యం దుకాణం ప్రారంభమయ్యే అవకాశం వుంది. మద్యం దుకాణాల ఏర్పాటులో 3 రోజులుగా ముద్దనూరులో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించిన సంగతి విదితమే.

కఠినంగా శిక్షించాలి

కమలాపురం : బద్వేల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థినికి నిప్పంటించి హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినికి నిప్పంటించి చంపడం దారుణమన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్టాలకు మరింత పదును అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఈ ఘటనలో నిందితుడిని తక్షణం కఠినంగా శిక్షిస్తే తప్పా సమాజంలో మార్పు రాదన్నారు. అలాగే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అయ్యప్ప భక్తులకు 41 రోజులు అన్నదానం ఏర్పాటు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్ష స్వీకరించిన భక్తులకు 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తుడు, ఎంఆర్ ఆగ్రో ఫాం అధినేత మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ఈ నేపథ్యంలో భక్తులకు 41 రోజుల పాటు సొంత డబ్బులతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయాలని తలంచాడు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



అవోపా జిల్లా అధ్యక్షుడు హరికృష్ణను సన్మానిస్తున్న వేంపల్లె అవోపా కార్యవర్గ సభ్యులు

వేంపల్లె : ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆదివారం చక్రాయపేట మండలంలోని గండిక్షేత్రం వాసవి నిత్యాన్నదాన సత్రంలో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అవోపా యూనిట్ సభ్యులందరూ పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గూడూరు హరికృష్ణతోపాటు మిగతా కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సేవే లక్ష్యంగా 1955 ఏడాదిలో అవోపాను కెఆర్. కృష్ణయ్య శెట్టి స్థాపించారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలాగే అవోపా అభివృద్ధికి మరింత కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, రిజినల్ ఉపాధ్యక్షుడు అంబికేశ్వర శెట్టి, పులివెందుల అధ్యక్షుడు మేడా దినేష్, వేంపల్లె అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్ర, మహిళా అధ్యక్షురాలు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు శివరావు, అధ్యక్షుడు మురళీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ



నూతన వధూవరులతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దంపతులు, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్‌అండ్‌బీ డీఈగా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డి, వైఎస్ మెమోరియల్ బాలికల కళాశాల అధ్యాపకురాలుగా పనిచేస్తున్న అనితమ్మల కుమారుడు యశ్వంత్‌రెడ్డి వివాహం జరిగింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దంపతులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి దంపతులు, వైఎస్ కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, ఇతర శాఖల అధికారులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉచిత మెడికల్ క్యాంప్

కడప రూరల్: వినికిడి లోపం సమస్యల గల వారికి మంగళవారం ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 0–19 సంవత్సరాలు కలిగిన వారికి దీన్‌దయాల్ శ్రవణా ఫౌండేషన్ అండ్ ఎస్‌హెచ్‌ఎం, ఎన్‌పీపీసీడీ, ఆర్‌బీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను కడపలోని డీఈఐసీ రిమ్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చే వారు తమ వెంట ఆధార్, రేషన్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఈఎన్‌టీ వైద్యుల ప్రిస్కిప్షన్ , ప్యూ ర్‌టోన్ ఆడియో మీటర్ రిపోర్ట్‌ను తీసుకురావాలని పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



ప్రమాదకరంగా పులివెందుల - ముదిగుబ్బ ఇరుకు రోడ్డు



సింగిల్ రోడ్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

- ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో
- ఇరుకు రోడ్డుతో వాహనదారుల అవస్థలు

పులివెందుల టౌన్ : పులివెందుల నుంచి ముదిగుబ్బకు వెళ్లే రహదారిలో పాత ఆర్టీసీ సర్కిల్ నుంచి వైఎస్సార్ రింగ్ రోడ్డు సర్కిల్ వరకు ఇరుకు రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫోర్‌లైన్ రోడ్డులో భాగంగా డబుల్ రోడ్డుగా ఉన్న రోడ్డును ఒకవైపు వెడల్పు చేశారు. మరోవైపు ఉన్న రోడ్డు సింగిల్‌గా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుపై ఏ నిర్ణయం తీసుకోకుండా ఏర్పాటు చేయలేదు. అంతలోనే ఎన్నికలు రావడంతో ఫోర్‌లైన్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మరోవైపు సింగిల్ రోడ్డుగా ఉన్న దారి వాహనదారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని మళ్లించేందుకు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఆదమరిచి వాహనాన్ని క్రాస్ చేయాలని చూస్తే ప్రమాదాలు తప్పడంలేదు. దీంతో ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురైన దాఖలాలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ దారిపొడవునా 8 చోట్ల అడ్డ రోడ్డులు ఉండటంతో ఆ దారిలో నుంచి వచ్చే వాహనాలు ఉన్నఫలంగా రావడంతో వాహనాలు ఢీ కొంటున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు వెళితే మరో వాహనం వెళ్లే పరిస్థితిలేదు. దీంతో వాహనదారులు ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఆద మరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురి కావాల్సిందేనని వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇరుకుగా ఉన్న రోడ్డును సరిచేసి రాకపోకలను యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..



వైఎస్సార్ సర్కిల్ రింగ్ రోడ్డు నుంచి పులివెందుల పట్టణంలోకి వచ్చే దారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేయాలన్న ఇబ్బందిగా మారుతోంది. అధికారులు స్పందించి రోడ్డును వెడల్పు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

- మల్లారెడ్డి(స్థానికుడు), పులివెందుల

వాహనాలలో వెళ్లాలంటే జంకుతున్నాం



రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని జంకుతున్నాం. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలను నెమ్మదిగా నడపాల్సి వస్తోంది. ఎవరైనా స్పీడ్‌గా వస్తే ఆరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాన్ని నడపాల్సి వస్తోంది. ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నాం.

- శివారెడ్డి(స్థానికుడు), పులివెందుల